పట్టువదలని అక్రమార్కులు

- ఉచిత ఇసుక పేరుతో దందా
- అనుమతి లేని ర్యాంపులలో తవ్వకాలు
- గ్రామాల్లో అక్రమంగా నిల్వలు
- లారీలపై ఇతర ప్రాంతాలకు తరలింపు

సీతానగరం: ఉచిత ఇసుక పేరుతో అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. ట్రాక్టర్లపై ఇసుకను తీసుకుపోయి అమ్మకాలు జరుపుతున్నారు. అనుమతులు లేని పలు ర్యాంపుల నుంచి సైతం ఇసుకను తవ్వుకుపోయి గ్రామాల్లో స్టాక్ పాయింట్లు పెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి అక్రమంగా నదీ గర్భాన్ని డొలిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఇసుక అక్రమార్కులు చెలరేగిపోయారు. ఈ దందాను అడ్డుకున్న వారిపై దాడులకు సైతం వెనకాడడం లేదు.

యథేచ్ఛగా తవ్వకాలు

సీతానగరం మండలంలోని వంగలపూడి-1, 2, కాటవరం ర్యాంపులలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. వంగలపూడి ర్యాంపు నుంచి ఇసుక తవ్వకాలను రెండు రోజుల క్రితం ప్రారంభించారు. అయితే సింగవరం, సీతానగరం, ముగ్గళ్ల తదితర అనధికార ర్యాంపుల నుంచి ట్రాక్టర్లపై ఇసుకను తరలిస్తున్నారు. దీనిలో భాగంగా వేగంగా ట్రాక్టర్లు తిరుగుతుండడంతో రోడ్డుపై రాకపోకలకు ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిబంధనలు ఇవే..

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అనుమతి ఇచ్చిన ర్యాంపు నుంచి మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలి. ఇసుక అవసరమైనవారు స్థానిక సచివాలయంలో ట్రాక్టర్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఎన్ని ట్రక్కులు ఇసుక అవసరమో తెలిపి ఉచితంగా ఇసుక తీసుకువెళ్లవచ్చు. కానీ ఇసుకను నిల్వ చేయడం, దాన్ని అమ్మకోవడం నేరం.



ముగ్గళ్ల ర్యాంపు నుంచి అక్రమంగా ట్రాక్టర్లపై ఇసుక తరలింపు


ముగ్గళ్ల శివాలయం వద్ద మైన్స్ డిపార్ట్‌మెంట్ సీజ్ చేసిన అక్రమ ఇసుక

అడ్డు వస్తే దాడులు

ముగ్గళ్ల దళితులకు చెందిన సొసైటీ లంక భూమిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని గత నెల 25న సొసైటీ సెక్రటరీ మట్టాడి వెంకట రమణ ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అయితే ఆయనపై ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు దాడి చేశారు. దీంతో వెంకట రమణ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

▶▶ గత నెల 28న రామచంద్రపురం నుంచి వస్తున్న కోడేబత్తుల జగన్‌మోహన్‌రావు తన మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. ట్రాక్టర్లను ఓవర్ టేక్ చేయడానికి సింగవరం నుంచి సీతానగరం వరకు అతనికి సైడ్ ఇవ్వలేదు. అంత వేగం ఏమిటని, ఇసుకపై టార్పాలిన్ ఎందు వేయలేదని జగన్మోహన్ ప్రశ్నించాడు. వెనుక ఉన్న ట్రాక్టరు డ్రైవర్లు తొక్కిపడేమని కేకలు వేస్తూ ముందు ట్రాక్టర్‌ను ప్రోత్సహించారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్.. జగన్‌మోహన్‌ను 150 మీటర్లు ఈడ్చుకెళ్లాడు. దీంతో రోడ్డుపైకి రావాలంటేనే ప్రజలు భయపడేలా ఇసుక రవాణా జరుగుతోంది.

స్టాక్ పాయింట్లు

ట్రాక్టర్లపై ఇసుక తీసుకువచ్చిన అక్రమార్కులు దాన్ని గ్రామాల్లో డంపింగ్ చేసి స్టాక్ పాయింట్లు పెడుతున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ నిల్వలు చేస్తున్నారు. అక్కడి నుంచి లారీలపై ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా జరుపుతున్నారు. ఇతర ప్రాంతాల్లో లారీ ఇసుక రూ.40 వేల వరకూ పలుకుతోంది. గ్రామాల్లో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రూ.10 వేలు నుంచి రూ.15 వేలకు లారీలపై ఎగుమతి చేస్తున్నారు. సీతానగరం లంక భూముల్లోనూ ఇసుక నిల్వలు ఉంచుతున్నారు. రెండు రోజుల క్రితం మైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో దాడులు చేసి ముగ్గళ్లలో ఇసుక నిల్వలను సీజ్ చేశారు. అయినా ఇసుక స్టాక్ పాయింట్లు అత్యధికంగానే ఉన్నాయి.

తప్పని ఇబ్బందులు

సింగవరం కైలాసభూమి రోడ్డులో ట్రాక్టర్లు వేగంగా వెళ్లడంతో దుమ్ము ఎగసి పంటపొలాల్లోని మొక్కలపై పడి, రేణింపు లేకుండా ఉంటున్నాయంటూ రైతులు అన్నారు. ఈ మేరకు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ముగ్గళ్ల ర్యాంపులోనూ స్థానికులు ట్రాక్టర్లను అడ్డగించారు. దీనితో రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల లేకుండా చూస్తామని ట్రాక్టర్ల యజమానులు ఒప్పించారు. స్థానిక ప్రజాప్రతినిధి అనుమతితోనే ఇసుకను తీసుకుపోతున్నామని ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు బాహాటంగా తెలుపుతున్నారు. కాగా.. అనుమతి లేని ర్యాంపుల నుంచి రాత్రీపగలూ అని తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ల దాడి



అనుమతులు లేని ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలించడమే కాకుండా ట్రాక్టర్ డ్రైవర్లు దాడులకు కూడా దిగుతున్నారు. రామచంద్రపురం నుంచి వస్తుంటే రెండు కిలోమీటర్ల వరకూ సైడ్ ఇవ్వలేదు. సీతానగరం వద్ద ట్రాక్టర్‌ను నిలిపితే అడిగితే నన్ను బెదిరించారు. సుమారు 150 మీటర్లు నన్ను లాక్కుంటూ వెళ్లాడు. రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయపడేలా పరిస్థితి ఏర్పడింది.

– కోడేబత్తుల జగన్మోహన్, రామచంద్రపురం

క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13న గ్రామాభివృద్ధి ప్రణాళికలపై ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులతో పాటు వివిధ శాఖాధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం


పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

రంగంపేట: ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో సర్పంచ్ వేము మాధవి అధ్యక్షతన స్థానిక 1, 2 అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం నిర్వహించిన పోషకాహార పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ వేము చిరంజీవి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధితురాలికి సాయం అందజేస్తున్న వీరబాబు

సీతానగరం: సింగవరంలో ఈ నెల 7వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో చిర్రోతు సీతారత్నానికి చెందిన ఇల్లు కాలిపోయింది. ఈ నేపథ్యంలో ఆమెకు శనివారం సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆర్థిక సాయం అందించారు. బియ్యం, నూనె ప్యాకెట్లు, నూతన దుస్తులు, దుప్పట్లతో పాటు రూ.15 వేలు అందజేశారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన సీతారత్నం కుటుంబాన్ని స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగన చినపోశియ్య, సీపీఐ ఎంఎల్ నాయకులు సిద్దె నాగరాజు, నందమూరి చిట్టిస్వామి, కడిదల రాధ, వేటూరి పార్వతి, పింద్రా ఆదియ్య పాల్గొన్నారు.

అద్దంకి రాజాయోనాకు సత్కారం

రాజమహేంద్రవరం రూరల్: నన్నయ యూనివర్సిటీ, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గోదావరి కవనోత్సవంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజాయోనాను సత్కరించారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ద్వారా దశాబ్ద కాలంగా చేస్తున్న సాంస్కృతిక, సాహిత్య, సామాజిక సేవల్ని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశామని శ్రీశ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో నన్నయ యూనివర్సిటీ తెలుగు అధ్యాపకుడు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ టి.పార్థసారథి, కావూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి


శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డైట్ ప్రిన్సిపాల్ జయశ్రీ

రాజానగరం: ప్రాథమిక విద్యను మరింతగా బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బొమ్మూరులోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎఎం జయశ్రీ అన్నారు. కొండగుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 4న మొదలైన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. వీటికి కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 250 మంది ఒకటి, రెండో తరగతి బోధించే ఉపాధ్యాయులు హాజరయ్యారు. ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి పి.రాంబాబు, రాష్ట్ర పరిశీలకుడు ఎ.ప్రభాకర్ ప్రసంగించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శిక్షణ పర్యవేక్షకులుగా కేఆర్‌పీలు గంగాధర్, జానకీదేవి, మామిడిశెట్టి రాంబాబు, శిక్షణ ఇచ్చే డీఆర్పీలుగా ఎస్‌వీఎన్ సత్యప్రసాద్, పరంశెట్టి సత్యనారాయణ, టి.కల్యాణి, షేక్ మగ్బుల్ బాషా, డి.మహేష్, కె.కృపావతి, బి.శంకర్రావు, వి.ప్రసాద్, జీవీవీఎస్‌కే గుప్తా, ఎ.గణేష్, శీలం సత్యశ్రీనివాసరావు, సీహెచ్.ఏడుకొండలు, కె.బాలకృష్ణ వ్యవహరించారు.

ఘనంగా అయ్యప్ప పేటతుళ్లి


అయ్యప్పస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పెదపూడి: అయప్ప శరణుఘోషతో జి.మామిడాడ గ్రామం మార్మోగింది. శనివారం ఆయప్ప స్వామి భక్తులు పేటతుళ్లి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయం వద్ద మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, భారీ బాణాసంచా, భక్తుల నృత్యాలతో ఊరేగింపు ప్రారంభించారు. గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో అయప్ప పడిపూజ వైభవంగా చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్తి భగవాన్‌రెడ్డి, గురుస్వాములు డీఆర్‌కె రెడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, భాస్కరరెడ్డి, వీరబాబుస్వామి, మండ రాజారెడ్డి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో సంపర వేంకటేశుడు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం రెండో శనివారం పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు దీపారాధన చేసి స్వామిని దర్శించుకున్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి


రామేశ్వరంలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ సీతాపతిరావు

పెదపూడి: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్, ఏఈఆర్వో పీపీ.సీతాపతిరావు కోరారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం రామేశ్వరం, కరకుదురు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ స్టేషన్‌లో శని, ఆదివారాలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కొత్త ఓట్లకు ధరఖాస్తులు, చిరునామా, పుట్టినతేదీల్లో మార్పులు, చేర్పులకు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. బూత్‌లెవెల్ అధికారులు రెండు రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఆయన వెంట వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, భాగయ్య, సిబ్బంది ఉన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రారంభం


రిబ్బన్ కత్తిరించి పోటీలను ప్రారంభిస్తున్న పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

ప్రకాశం నగర్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలను శనివారం ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం కలిగిస్తాయన్నారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి 13 జట్లు పోటీలకు వచ్చాయన్నారు. శని, ఆదివారాలు పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులందరికీ వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పరిశీలకులు తంబి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, నాగరాజు, ఎస్‌కేవీటీ హెచ్ఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది, సర్పంచ్ గంగరాజు

రంగంపేట: న్యాయ వ్యవస్థపై కనీస అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు పేర్కొన్నారు. రంగంపేట మండలం వెంకటాపురం గ్రామంలో సర్పంచ్ ముంగి గంగరాజు అధ్యక్షతన శనివారం పెద్దాపురం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు అత్తిలి ప్రపోజీ, మడికి రాంబాబు, సకురు దుర్గాప్రసాద్, గణేష్ వల్లిబాబులు వివిధ చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు నిర్బంధ విద్య అభ్యసించవలసి ఉందని దీనికి విరుద్ధంగా ఎవరైనా పనుల్లో నియమిస్తే అట్టి వారిని గుర్తించి వారికి తగిన కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. వారిని పనిలో నియమించుకున్న యజమానులకు తగిన శిక్షలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు అప్పలకొండ, నూకతట్టు రమణ, లక్ష్మీ, విజయ, చందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన లక్ష్మీశ్రావ్యతో ఉపాధ్యాయులు

రంగంపేట: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 విభాగం అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కె.లక్ష్మీశ్రావ్య ద్వితీయ స్థానం సాధించిందన్నారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరగబోయే 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థిని లక్ష్మీశ్రావ్యతో పాటు పీఈటీలు శైల, బూరిబాబులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

సీతానగరం: ప్రధాన మంత్రి స్వాత్య మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఈ.ఏసు రాణి శనివారం వైద్య సేవలు అందించారు. 43 మంది గర్భిణీ స్త్రీలను పరీక్షించారు. అవసరమైన రక్తపరీక్షలు చేసి, మందులు అందించారు. వీరిలో ఎనిమందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. సత్యసాయి సేవా విభాగం ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, స్టాఫ్ నర్సు కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి


ప్రభుత్వాసుపత్రి వద్ద ఇన్‌చార్జి డీపీవో నాగలత తదితరులు


గుడిమెట్ల శ్రీలక్ష్మీ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బొబ్బిల్లంక గ్రామ పంచాయతీ కార్యదర్శి గుడిమెట్ల శ్రీలక్ష్మి(40) శనివారం రాత్రి 7 గంటల సమయంలో కాతేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. గుడిమెట్ల శ్రీలక్ష్మి కాతేరు శివారున ఉన్న అపార్టుమెంట్‌లో తల్లి, తమ్ముడు, మరదలతో కలిసి ఉంటున్నారు. బొబ్బిల్లంక పంచాయతీలో విధులు ముగించుకుని శనివారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. అనంతరం మందులు కొనుగోలు చేసేందుకు స్కూటీపై రాజమహేంద్రవరం బయలుదేరారు. రాత్రి ఏడుగంటల సమయంలో కాతేరు కోకోకోలా డిపో ఎదురుగా ముందు వెళ్తున్న ట్రాక్టరును తప్పించే ఎదురుగా వాహనాలు రావడంతో ఒక్కసారిగా పక్కకు జరిగారు. ఆ ప్రయత్నంలో ట్రాక్టర్ వెనుక చక్రం కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో సంఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీలక్ష్మీ సోదరుడు గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద విషాదఛాయలు

ఎప్పుడూ నవ్వుతూ అందరితో కలుపుగోలుగా ఉండే శ్రీలక్ష్మి మృతి వార్త తెలియగానే సచివాలయంలోని సిబ్బంది రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు విధి నిర్వహణలో ఉండి ఇంటికి వచ్చిన ఆమె మృత్యువాత పడ్డారన్న విషయం జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, రూరల్ ఈవోపీఆర్ అండ్ ఆర్డీ పి.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ప్రమాద సంఘటనను అడిగి తెలుసుకున్నారు. శ్రీలక్ష్మీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా..శ్రీలక్ష్మి గత నెలలోనే కొరుకొండ మండలం బొల్లెద్దుపాలెం నుంచి బొబ్బిల్లంక పంచాయతీకి బదిలీపై వచ్చారు.

ఇసుక రీచ్ పరిశీలన


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీతానగరం: జిల్లాలో ఇళ్ల నిర్మాణాల కోసం, ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత పనుల కోసం అవసరమైన ఇసుక అందుబాటులో ఉండేలా బోట్స్‌మ్యాన్ సొసైటీలు ప్రతి రీచ్ వద్ద రెండు షిఫ్టులలో పనిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ట్రాక్టర్లపై ఇసుక ఉచితంగా తీసుకువెళ్లవచ్చన్నారు. వంగలపూడి రీచ్‌ను శనివారం సాయంత్రం జేసీ చిన్నరాముడు, ఆర్డీవో కృష్ణ నాయక్‌లతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా చేయడమే లక్ష్యంగా పెద్ద సంఖ్యలో బోట్స్ మ్యాన్ సొసైటీలను అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. వంగలపూడి రీచ్ పాయింట్ ద్వారా కనీసం రోజుకు 2 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో తీసుకురావాలన్నారు.

ఘనంగా జీఎస్ఎల్ వైద్య కళాశాల వార్షికోత్సవం


వైద్య విద్యార్థుల ప్రదర్శనలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మూర్తి

రాజానగరం: దేశంలో సిమ్యులేషన్ ల్యాబ్, మిషన్ లెర్నింగ్ సదుపాయాలు ఉన్న వైద్య కళాశాలలు నాలుగైదు వరకే ఉన్నాయని, వాటిలో జీఎస్ఎల్ ఒకటి కావడం అదృష్టమని ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఎస్ఆర్ఎస్ మూర్తి వైద్య విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ వైద్య విద్యలో అత్యుత్తమ ఫలితాలను సాధించాలన్నారు. వైద్య విద్యకు సంబంధించి కళాశాలలో ఉన్న అధునాతన సదుపాయాలు, విద్యార్థులు సాధించిన ప్రగతిని ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గురునాథ్, ఆస్పత్రిలో ఆధునిక వైద్య సేవల గురించి సూపరింటిండెంట్ టీవీఎస్పీ మూర్తి వివరించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు ప్రదర్శనలిచ్చారు.